క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ సమావేశానికి తరలిరండి

బుచ్చెయ్యపేట: చోడవరం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీలు, నాయకులు తరలి రావాలని పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, జెడ్పీటీసీ దొండా రాంబాబు కోరారు. ఉదయం 10 గంటలకు ఎమ్మెల్సీ ఎన్నికలపై చర్చించేందుకు మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, బూడి ముత్యాలనాయుడు, ప్రభుత్వ మాజీ విప్ కరణం ధర్మశ్రీ విచ్చేస్తున్నారన్నారు.

గిరిజన గ్రామాల్లో వీధి లైట్ల ఏర్పాటు



వేలంబయలులో వీధి లైట్లు ఏర్పాటు చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి యశోద

దేవరాపల్లి: గరిశింగి పంచాయతీ శివారు గిరిజన గ్రామాల్లో వీధి లైట్లను యుద్ధప్రాతిపదికన ఆదివారం ఏర్పాటు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు వీధి లైట్లు మరమ్మతులకు గురికావడంతో గ్రామస్తుల వినతి మేరకు పంచాయతీ కార్యదర్శి పి.యశోద తక్షణమే స్పందించారు. ఆదివారం సెలవు దినం అయినప్పటికీ వేలంబయలు, రేగుల బంద, సంతపాలెం గ్రామాలలో ఎలక్ట్రీషియన్‌తో వీధి దీపాలు అమర్చారు. డొర్రి చెరువు, కొత్తూరు గ్రామాలలో అక్కడక్కడా ఆగిన చోట కూడా సోమవారం వీధి లైట్లును ఏర్పాటు చేస్తామన్నారు. పంచాయతీ అధికారి యశోద స్పందన పట్ల ఆయా గ్రామాల గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



కేక్ కట్ చేసి ఆనందం పంచుకుంటున్న మహిళలు

దేవరాపల్లి: మండల వ్యాప్తంగా స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆర్య వైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో దేవరాపల్లిలో మహిళలంతా కేక్ కట్ చేసి ఒకరికొకరు స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అనంతరం ఆటపాటలతో ఆనందంగా గడిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ స్నేహానికి ప్రతీకగా ఫ్రెండ్‌షిప్ డే బ్యాండ్‌లను కట్టి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ చిన్ననాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

3 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్



నిరసన తెలుపుతున్న రెల్లి కులం ఎంప్లాయిస్

నర్సీపట్నం: రెల్లి కులానికి మూడు శాతం రిజర్వేషన్ కల్పించాలని రెల్లి కులం ఎంప్లాయిస్ డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక అబిద్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించింది. నిధులు కోసం పోరాటంలో మాల, మాదిగ, రెల్లి సంఘాలు ఐక్యతతో ఉండాలని నినాదాలు చేసింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల నుంచి వర్గీకరణ ప్రారంభించాలని మంగళగిరి భగీరథ, చెన్నా శ్రీనివాసరావు, మజ్జి దినేష్, భాస్కరరావు, ఉపాధ్యాయులు శివకేశవ, ప్రకాష్, ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు.

నేటి నుంచి కోటి కుంకుమార్చన

అనకాపల్లి: మండలంలోని సత్యనారాయణపూరం పంచాయతీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి కోటి కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు యద్ర త్రినాథరావు, ధర్మకర్త బోయిన రమణాజీలు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నెల రోజుల పాటు భక్తులచే ఈ కుంకుమార్చన కార్యక్రమం కొనసాగుతుందన్నారు. శ్రావణ మాసం నాలుగు వారాలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.

అరకొరగా బోధన

విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు కావస్తోంది. ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులకు బోధన అరకొరగానే అందుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్‌ను కూటమి ప్రభుత్వం రద్దు చేయకుండా యథావిధిగా కొనసాగించి ఉంటే ఈ పాటికి ఉపాధ్యాయుల ఖాళీలు భర్తీ అయ్యేవి. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేది. ప్రస్తుతం డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా పోస్టుల భర్తీ ఈ ఏడాదికి పూర్తయ్యేలా కనిపించడం లేదు. దాంతో ఈ విద్యా సంవత్సరమంతా ఎలా నెట్టుకురావాలో అర్థంగాక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

- ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత
- ఖాళీలు భర్తీ చేయని కూటమి ప్రభుత్వం
- దేవరాపల్లి మండలంలో 4 పాఠశాలల మూత
- పలు చోట్ల ఏకోపాధ్యాయులతో తరగతులు



దేవరాపల్లి మండలం ఎస్. చేనులపాలెంలో మూతపడిన ప్రాథమిక పాఠశాల

దేవరాపల్లి: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చాక దేవరాపల్లి మండలంలో నాలుగు ప్రాథమిక పాఠశాలలను మూసివేశారు. విద్యా రంగంపై ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతోపాటు గత ప్రభుత్వం అమలు చేసిన ఇంగ్లిష్ మీడియం విద్యను వ్యతిరేకించడం తదితర కారణాలతో పలువురు విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను వీడి ప్రైవేటు స్కూళ్ల బాట పట్టారు. ఈ నేపథ్యంలో ఈ విద్యా సంవత్సరంలో దేవరాపల్లి మండలం రైవాడ పంచాయతీలో బేతపూడి, నాగయ్యపేట పంచాయతీలో సీతంపేట, మారేపల్లి పంచాయతీ శివారు చేనులపాలెం, కె.ఎం.పాలెం పంచాయతీ శివారు యండపల్లిపాలెం ఎంపీపీ స్కూళ్లు మూతపడ్డాయి. దీంతో స్థానిక విద్యార్థులు సుదూర ప్రాంతంలోని పాఠశాలలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. మండలంలో 39 ఎంపీపీ స్కూల్స్, 6 ప్రాథమికోన్నత, 9 హైస్కూళ్లు, కేజీబీవీ, గురుకుల విద్యాలయాలు ఉన్నాయి. దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్, సోషల్, ఫిజికల్ సైన్స్, ఎ. కొత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మ్యాథ్స్ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఆయా సబ్జెక్టుల బోధన సక్రమంగా జరగని పరిస్థితి నెలకొంది.



చీడికాడ: భోజనాలు చేస్తున్న విద్యార్థులు

20 పాఠశాలల్లో ఏకోపాధ్యాయ బోధన

కె.కోటపాడు: మండలంలోని 20 ప్రభుత్వ పాఠశాలల్లో బోధనను ఏకోపాధ్యాయులతో నెట్టుకొస్తున్నారు. దాంతో ఆయా తరగతుల విద్యార్థులందరికీ నాణ్యమైన విద్య అందడం లేదని వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఏదైనా పాఠశాలలో ఉపాధ్యాయుడు సెలవు పెడితే ఆ రోజు బోధన అందడం లేదు. అదే విధంగా మండలంలో 52 ప్రభుత్వ పాఠశాలల్లో 195 మంది టీచింగ్, 27 మంది నాన్ టీచింగ్ ఉపాధ్యాయులు కలిపి 222 మంది పూర్తిస్థాయిలో ఉన్నారు. 4,532 మంది విద్యార్థులు చదువుతున్నారు.

ఉపాధ్యాయుల కొరత

మాడుగుల రూరల్: మండలంలోని మొత్తం 67 పాఠశాలల్లో 5,328 విద్యార్థులు చదువుతున్నారు. 131 మంది ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు - 2, తెలుగు - 1, హిందీ - 2 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆయా సబ్జెక్టుల్లో బోధన అందడం లేదని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోతనపూడి, తాటిపర్తి, తాటిపర్తి శివారు లక్ష్మంపేట, బిళ్లలపాలెం, బి. జాలంపల్లి, వాడపాడు, అవురువాడ గ్రామాల్లో ఏడు ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి.

మాకవరపాలెం/గొలుగొండ: మాకవరపాలెం మండలంలోని 54 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గింది. వీటిలో గత విద్యా సంవత్సరం 2,904 మంది విద్యార్థులు చదివారు. ఈ విద్యా సంవత్సరం 2,861 మంది ఉన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన ఇంగ్లిష్ మీడియం విద్యను ప్రస్తుత కూటమి ప్రభుత్వం వ్యతిరేకించడం తదితర కారణాలతో పలువురు విద్యార్థులు ప్రైవేటు స్కూళ్లలో చేరారు. గొలుగొండ మండలంలోని 62 ప్రభుత్వ పాఠశాలల్లో 4224 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఉపాధ్యాయుల కొరత ఉండటంతో విద్యా బోధన సక్రమంగా అందడం లేదని విద్యార్థులు వాపోతున్నారు.

ఉపాధ్యాయులతో సర్దుబాటు బోధన

నాతవరం: మండలంలోని 31 గ్రామ పంచాయతీల పరిధిలో 61 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 4,993 మంది విద్యార్థులు చదువుతున్నారు. మొత్తం 130 మంది ఉపాధ్యాయులకుగాను 125 మంది ఉండగా, ఖాళీ ఉన్న చోట సర్దుబాటు చేసి తరగతులు నిర్వహిస్తున్నారు. ఎం.బి.పట్నం పంచాయతీ శివారు ఎ.శరభవరం రామాలయం అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థుకు బోధిస్తున్నారు. వై.బి.అగ్రహారం పాఠశాలలో మధ్యాహ్న భోజనం నిర్వాహకులు రుచికరంగా తయారు చేసి పెట్టలేదని ఫిర్యాదులు రావడంతో మూడు రోజులు క్రితం సర్పంచ్ కోసూరి విజయ్ స్వయంగా పరిశీలించారు. మెనూ అమలుతోపాటు రుచికరంగా భోజనం తయారు చేయాలని సూచించారు.

రోలుగుంట: మండలంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలు-8, ఎంపీపీ -44, ఎంపీపీ యూపీ-2, కేజీబీవీ-1 మొత్తం 55 పాఠశాలలు నడుస్తున్నాయి. గత ప్రభుత్వం జగనన్న గోరుమద్ద పేరును ప్రస్తుత ప్రభుత్వం ప్రధానమంత్రి పోషణ (డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంగా) పేరు మార్చి పాత మెనూనే అమలు చేస్తున్నారు. ఎంపీపీ పాఠశాలలు 44 ఉండగా, రోల్ ప్రకారం 25 పాఠశాలలు ఏకోపాధ్యాయులతోనే నడుస్తున్నాయి.

చీడికాడ: మండలంలో తురువోలు, చుక్కపల్లి, ఖండివరం, బైలపూడి, అప్పలరాజుపురం, వరహాపురం ఉన్నత పాఠశాలల్లో ప్రాథమిక పాఠశాలలు 3, 4, 5 తరగతులు విలీనం కాగా, ఆయా పాఠశాలల్లో ఉన్న అదనపు ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లి పోయారు. అయితే విద్యార్థుల సంఖ్యను బట్టి ప్రస్తుతం 1:20 చొప్పున అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఉన్నారు. ప్రస్తుతానికి పాఠశాలల్లో గత ప్రభుత్వం అందించిన మెనూనే అమలు చేస్తున్నారు.

పూర్తిస్థాయిలో అందని స్టూడెంట్ కిట్లు

బుచ్చెయ్యపేట: మండలంలో మొత్తం 65 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. గొన్నవానిపాలెం, మల్లాం, వడ్డాది, కుముదాంపేట తదితర గ్రామాల్లో పాఠశాలలు శిథిలావస్థలో ఉన్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు అవుతుండగా, ఇప్పుడు స్కూల్ బ్యాగులు, బూట్లు పంపిణీ చేస్తున్నారు. గతంలో నాల్గు వేలకు పైగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన చేయగా, ఈ ఏడాది 3,878 మంది మాత్రమే ఉన్నారు. 138 మంది ఉపాధ్యాయులకుగాను 136 మంది మాత్రమే ఉన్నారు. ఇద్దరి ఉపాధ్యాయుల్ని నియమించాల్సి ఉంది.

చోడవరంలోనే అదే పరిస్థితి

చోడవరం రూరల్: మండలంలో 62 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, మొత్తం 4,994మంది విద్యార్థులు చదువుతున్నారు. స్కూలు బ్యాగులు 4,994గాను 4,990 అందగా, నలుగురు ఉన్నత పాఠశాల విద్యార్థులకు అందలేదు.

- బూట్లు విషయానికి వస్తే 5003 జతలు ఇండెంట్‌కు గాను 4808 మాత్రమే మండల విద్యాశాఖాధికారి కార్యాలయానికి రాగా, వాటిని విద్యార్థులకు అందజేశారు. 195 షూస్ అందాల్సి ఉండగా, వీరిలో విద్యార్థినులు 181మంది విద్యార్థులు 14మంది ఉన్నారు.
- యూనిఫామ్స్ 4,994మందికి రావాల్సి ఉండగా వచ్చినవి 4,973 మాత్రమే. 21 మందికి యూనిఫామ్స్ అందలేదు.
- జగనన్న విద్యా కానుకను ప్రస్తుత కూటమి ప్రభుత్వం పేరు మార్చి స్టూడెంట్ కిట్ అని అందజేసినా, దీంట్లో గత ప్రభుత్వం అన్నీ సిద్ధం చేయగా వండి వార్చిన అన్నంపై అమ్మగారు వచ్చి చెయ్యి వేసిన చందంగా పిల్లలకు ఆలస్యంగానైనా అందించారు. ఇప్పుడే ఇలా ఉంటే వచ్చే విద్యా సంవత్సరం ఇంకెలా ఉంటుందోనని విద్యార్థుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఉపాధ్యాయుడిని నియమించాలి



మా గ్రామ పాఠశాలలో ఏకోపాధ్యాయ బోధన కష్టతరంగా ఉంది. ఒక్కరే పని చేయడం వల్ల అకస్మాత్తుగా సెలవు పెడితే ఆ రోజు పాఠశాల మూతపడుతోంది. దాంతో చాలామంది విద్యార్థులు ప్రైవేటు స్కూళ్లలో చేరుతున్నారు. వెంటనే ప్రభుత్వం మరో ఉపాధ్యాయుడిని నియమించాలి.

– పి నాగరాజు, గొన్నవానిపాలెం, బుచ్చెయ్యపేట మండలం

అంగరంగ వైభవంగా మోదమాంబ పండగ

- కె.జె.పురంలో ఆలయం వద్ద అన్నసమారాధన
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



శక్తి వేషాలు



అమ్మవారి ఆలయంలో భక్తులు రద్దీ



ఆలయం వద్ద భక్తులకు అన్నసమారాధన చేస్తున్న అరుణ్‌కుమార్

మాడుగుల రూరల్: కె.జె.పురం మోదమాంబ పండగ ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని తెల్లవారుజాము నుంచి భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ భీశెట్టి శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడు, సర్పంచ్ జామి రమణబాబు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారిని ఎంపీపీ తాళ్లపు రెడ్డి వెంకట రాజారామ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, తదితర నాయకులు దర్శించుకున్నారు. ఆలయం వద్ద కేటరింగ్ యాజమాని పాలకుర్తి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. పలు యూత్ సంఘాల ఆధ్వర్యంలో మజ్జిగ, పులిహోర, బూందీ పంపిణీ చేశారు. సాయంత్రం నుంచి నేల వేషాలు, తీన్‌మార్ డప్పులు, కాళికామాత వేషాలు, చిటికెలు, తప్పెటగుళ్లు, మందుగుండు సామగ్రితో జాతర వైభవంగా నిర్వహించారు. పండగ సందర్భంగా చెక్క ఏనుగు మీద ఆదారి తాతంనాయుడు పెద్ద కుమారుడు కృష్ణ గ్రామ పురవీధుల్లో ఊరేగారు. ఈ కార్యక్రమంలో డప్పులు, బ్యాండు మేళం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఘనంగా చోడేశ్వరమ్మ పండగ



పురవీధుల్లో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

నాతవరం: దేవాంగుల ఇలవేల్పు చోడేశ్వరమ్మ పండగను ఆదివారం నాతవరంలో ఘనంగా నిర్వహించారు. ఏటా ఆషాఢ మాసం అమావాస్య రోజున అమ్మవారి పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా దేవాంగులంతా ప్రతి ఇంటి నుంచి అమ్మవారి సారెతో ఊరేగింపుగా ముందుగా సిద్ధి వినాయక ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. అనంతరం పురవీధుల్లో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి వెళ్లి పసుపుకుంకుమ, చీర, జాకెట్టు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

మెగా రక్తదాన శిబిరం పోస్టర్ విడుదల



వడ్డాదిలో రక్తదాన శిబిరం పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

మాడుగుల: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15వ తేదీన స్థానిక భారత నిర్మాణ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న రక్తదాన శిబిరం పోస్టరును అనకాపల్లి క్యాంపు కార్యాలయంలో ఎంపీ సీఎం రమేష్ ఆవిష్కరించారు. అనంతరం భారత నిర్మాణ సేవా ట్రస్టు అందిస్తున్న సేవలు అడిగి తెలుసుకుని వారిని అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బాలాజీ, ట్రస్టు సభ్యులు గౌరీపట్టపు మహేష్‌కుమార్, సీహెచ్.మధు, బి. నాయుడు, పెదపాటి నాగరాజు, చందు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: వడ్డాదిలో అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా అమ్మ హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే మెగా రక్తదాన శిబిరం పోస్టర్‌ను ఉత్తరాంధ్ర రక్తదాన ప్రచారకర్త వినోద్ బాలు విడుదల చేశారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా వడ్డాదిలో కోవెల అప్పన్నదొర జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. వెయ్యి మంది యువకులు పాల్గొని రక్తదానం చేయాలని కోరారు. జిల్లా జెడ్పీటీసీల ఫోరం అధ్యక్షుడు దొండా రాంబాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, మోదకొండమ్మ ఆలయ కమిటీ చైర్మన్ దొండా గిరిబాబు, యూత్ సంఘం నాయకులు దొండా నరేష్, శిరిగిరిశెట్టి శ్రీరామూర్తి, ఎస్‌ఐ డి. ఈశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

కేరళ బాధితులకు విరాళాల సేకరణ



విరాళాలను సేకరిస్తున్న సీపీఎం నాయకులు

కె.కోటపాడు: కేరళలోని వయనాడ్ జిల్లాలో అనాథలైన కుటుంబాలను మానవత్వంతో ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సీపీఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు కోరారు. ఆదివారం ఆనందపురంలో పార్టీ తరపున విరాళాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడి 300 మంది చనిపోగా, వేలాది మంది నిరాశ్రయులయ్యారని వాపోయారు. వీరికి తోడ్పాటుగా అన్ని ప్రాంతాల వారు ముందుకొచ్చి సహాయాన్ని అందించాలని కోరారు. నాయకులు గండి నాయినిబాబు, యర్రా దేముడు, వనుము సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఖరీఫ్ వరినాట్లు

- కూలీల కొరతతో రైతులు సతమతం



కె.కోటపాడులో వరినాట్లు వేస్తున్న కూలీలు



దమ్ము పనులు చేసుకుంటున్న రైతులు

రోలుగుంట: మండలంలో ఖరీఫ్ వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. అన్ని గ్రామాల్లోనూ వరినాట్లు ఒకేసారి చేయాల్సి రావడంతో కూలీల కొరతతో రైతులు సతమతమవుతున్నారు. దీనిని అదునుగా తీసుకున్న మహిళా కూలీలు సొంత గ్రామాల కన్నా పొరుగు మండలాలకు వెళ్తున్నారు. అక్కడ కూలి అధికంగా పలకడం, ఆటోలను కూలీల గ్రామాలకు పంపించి రాను, పోను రవాణా చార్జీలు వారే భరిస్తున్నారు. సొంత గ్రామాల్లో మహిళా కూలీకి రోజుకు రూ.300, పొరుగు మండలాల్లో రూ.350 నుంచి రూ.400 వరకూ చెల్లిస్తున్నారు. మండల సాధారణ విస్తీర్ణం నాలుగు వేల ఎకరాల్లో నాట్లు పడాల్సి ఉంది. నారు పోత, దమ్ముల పనులు పూర్తయినా నాట్ల కోసం రైతన్నలు అనేక పాట్లు పడుతున్నారు. వ్యవసాయాన్ని ఉపాధి పథకానికి అనుసంధానం చేస్తే అధిక శాతం కూలీల సమస్య తీరుతుందని చెబుతున్నారు.

వ్యవసాయ కూలీలకు డిమాండ్

కె.కోటపాడు: ఇటీవల కురిసిన వర్షాలతో ఖరీఫ్ వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. ప్రధానంగా పల్లపు ప్రాంతాల్లో వర్షపునీటితో పాటు చెరువుల్లో నీటిని పొలాలకు మళ్లించి వరినాట్లు వేస్తున్నారు. దాంతో మహిళా కూలీలకు డిమాండ్ పెరిగింది. గరిష్ఠంగా రోజు కూలీ రూ.300 చెల్లిస్తున్నారు. మెట్ట ప్రాంతాల్లో వరిఆకు ఎదిగినా వర్షాలు పడిన తర్వాత నాట్లు వేసేందుకు సమాయత్తమవుతున్నారు. ఈ గ్రామాల్లో మడులను దమ్ము పడుతున్నారు.

మట్టి గణపతి విగ్రహాలనే తయారు చేయాలి



చవితి పూజకు మట్టి విగ్రహాలనే తయారుచేయాలని వినతి పత్రాలు అందిస్తున్న కుమారస్వామి

తుమ్మపాల: సెప్టెంబర్ 7న వినాయక చవితి సందర్భంగా ప్రజలంతా మట్టితో తయారుచేసిన వినాయక ప్రతిమలనే వినియోగించాలని వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ చైర్మన్ ఆడారి కూమారస్వామి పిలుపునిచ్చారు. ఈ మేరకు మట్టి వినాయక ప్రతిమలనే తయారుచేయాలంటూ పట్టణంలోని పలు వినాయక విగ్రహ తయారీదారులకు ఆదివారం వినతి పత్రాలు అందించారు. ఎట్టి పరిస్థితుల్లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను తయారుచేయవద్దని కోరారు. గణపతిని క్రియేటివిటీ పేరిట అభ్యంతరకర రూపాల్లో కూడా చూపించరాదన్నారు.

జీఎస్టీ తొలగింపునకు ఎంపీలు కృషి చేయాలి

ఎల్‌ఐసీ ఏవోఐ స్టేట్ ఈసీ మెంబర్ కేవీ రమణ విజ్ఞప్తి



దేవరాపల్లి: కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ మాదిరిగా దేశంలోని అన్ని పార్టీల ఎంపీలు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి బీమా పాలసీలపై జీఎస్టీని ఉపసంహరించుకునేలా కృషి చేయాలని ఎల్‌ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఏవోఐ) స్టేట్ ఈసీ మెంబర్ కె.వి.రమణ కోరారు. ఆదివారం దేవరాపల్లిలో ఆయన మాట్లాడుతూ జీవిత, ఆరోగ్య బీమా పాలసీల ప్రీమియంపై ప్రభుత్వం విధిస్తున్న 18 శాతం జీఎస్టీని తొలగించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు నితిన్ గడ్కరీ లేఖ రాయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం ఎల్‌ఐసీ పాలసీలపై జీఎస్టీ విధించిన నాటి నుంచి ఎల్‌ఐసీ ఉద్యోగ సంఘాలు, ఏజెంట్ల యూనియన్లు, ఇతర సంఘాలు ఎన్నో పోరాటాలు చేశాయన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో జీవిత, ఆరోగ్య బీమా పాలసీలు దేశ ప్రజలకు ఎంతో అవసరమని, ఇవి ప్రజలకు సామాజిక భద్రతను కల్పిస్తున్నాయన్నారు. వీటిపై జీఎస్టీ విధించడం దురదృష్టకరమన్నారు. జీఎస్టీ విధించడంతో జీవిత బీమా రంగాల అభివృద్ధికి అవరోధంతోపాటు పాలసీదారులకు భారంగా మారుతుందన్నారు. ఎన్డీఏకు దేశ ప్రజలపై ప్రేమ ఉంటే జీవిత, ఆరోగ్య బీమా పాలసీలపై జీఎస్టీని ఉపసంహరించుకోవాలన్నారు.

సరుగుడులో సండే సందడి



సరుగుడు జలపాతం వద్ద సందర్శకులు తాకిడి



జలపాతం దిగువ మెట్ల ప్రాంతంలో చూడముచ్చటగా ప్రవహిస్తున్న నీరు

నాతవరం: మండలంలోని సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకులతో సందడి నెలకొంది. ఇటీవల తుపాను వర్షాలకు ఇక్కడ ఎత్తయిన రెండు కొండల మధ్యలోంచి నీటి ప్రవాహం మరింత పెరిగింది. దాంతో సందర్శకులు జలకాలాటాడేందుకు సెల్ఫీలు, ఫొటోలు తీసుకునేందుకు పోటీపడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జలపాతం వద్ద సందర్శకులు సందడి నెలకొంది. ఇక్కడకు కాకినాడ, అనకాపల్లి జిల్లాల నుంచి ప్రత్యేక వాహనాలపై అధికంగా రావడంతో సరుగుడు - నాతవరం రోడ్డులో రద్దీ ఏర్పడింది. గతంలో జలపాతం సమీపానికి వాహనాలు వచ్చేవి. ఇటీవల తుపానుకు మట్టి రోడ్డు ధ్వంసం కావడంతో ఆర్అండ్‌బీ రోడ్డు తర్వాత వాహనాలు వెళ్లటం లేదు. దీంతో సందర్శకులు అర కిలోమీటరు మేర నడిచి వెళ్లాల్సి వస్తోంది. అదేవిధంగా తాండవ రిజర్వాయరుకు సందర్శకుల తాకిడి పెరిగింది. ఇటీవల వర్షాలకు ప్రాజెక్టులో నీటిమట్టం పెరగడంతో జలకళ సంతరించుకుంది.

యువత సన్మార్గంలో నడవాలి

- స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు



కార్యక్రమంలో పాల్గొన్న స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం: యువత సన్మార్గంలో నడవాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. పాకలపాడు గురుదేవుల ఆశ్రమంలో ఆదివారం ఏర్పాటు చేసిన సాయి యువ స్వరం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్య ద్వారానే జ్ఞానం వస్తుందన్నారు. సత్య సాయిబాబా సేవలు ఎనలేనివని కొనియాడారు. రాష్ట్రంలో వేలాది గ్రామాలను దత్తత తీసుకొని అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు.

మరిడితల్లిని దర్శించుకున్న స్పీకర్

గొలుగొండ: మేజర్ పంచాయతీ ఏఎల్‌పురంలో మరిడితల్లిని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదివారం దర్శించుకున్నారు. ఇక్కడ అమ్మవారి పండగ ఘనంగా నిర్వహించారు. గొలుగొండ ఎస్సీ కాలనీలో నూకాలతల్లి పండగ ఘనంగా నిర్వహించారు. పండగ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చిటికెల తారకవేణుగోపాల్, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.